చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళా రూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

అస్తిత్వ ఉద్యమాలే నేపథ్యంగా..

ఆధునిక సాహిత్యం విభిన్న రీతులు సంతరించుకుంటూ నూతనత్వాన్ని సొంతం చేసుకుంటున్నది. శైలి, నిర్మాణ పరంగా ఎప్పటికప్పుడు సరికొత్త పుంతలు తొక్కుతూ, అనేక పేర్లతో, విధానాలతో నవీన సాహిత్యం తన వర్గప్రయోజనం దిశగా అడుగులేస్తున్నది. సామాజిక చైతన్యం, వ్యవస్థ మార్పు, సాహిత్య ప్రయోజనాలు ఇలా ఆధునిక సాహిత్యం వర్గ చైతన్యాన్ని రగిలించటంలో తిరుగుబాటును, శాస్త్రీయ దృక్పథాన్ని నూరిపోయటంలో చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపుతున్నది.

సాహిత్యం ఆధునికతను సంతరించుకున్న కొద్దీ సాధారణ ప్రజలకు మరింత చేరువైంది. ఒకప్పటి సాహిత్యం అందని ద్రాక్ష అయితే ఇప్పటి సాహిత్యం అందిన అరటిపండు. ఒకప్పుడు పద్యరూపానికి, అటు పిమ్మట వచన దొంతరలకు పరిమితమైన సాహిత్యం నేడు అనేకానేక రూపాలతో, రీతులతో అలరారుతుండటం గమనార్హం.

సాహిత్యంలో ఆధునికత కాలానికి సంబంధించినది కాదు. అది అభివ్యక్తికి సంబంధించినది. ఈ విషయాన్ని చాలామంది విమర్శకులు చెప్పి ఉన్నారు. వ్యవస్థలో మార్పుకు మొదటి కారణం ఆధునిక సాహిత్యం. కవిత్వానికి బోలెడు పేర్లు, ప్రక్రియలు ఉన్నమాట నిజం. సాధారణంగా తెలుగులో కవిత్వం అంటే భావకవిత్వం, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళిత, మైనారిటీ వంటివన్నీ కవిత్వ రీతులే. కవిత్వానికి వాహకం కావాలని చాలామంది పెద్దలు చెప్పినట్టే వస్తువో, వ్యక్తో కవిత్వంగా మారుతాడు. అనుభూతి కవిత్వంలో రూపాన్ని, భావాన్ని ఒకే తాటికి కట్టడం వల్ల గుణగణాలపరంగా కవిత్వ రీతిలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. అవన్నీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసే దిశగా కొనసాగుతున్నాయి.

కవిత్వం అంటే పాత్ర, స్థల, కాలానుగుణంగా సాగడం ఒక పద్ధతి. తెలుగు ఆధునిక కవిత్వంలో కవిత్వం దాదాపు వంద సంవత్సరాల క్రితమే ఆత్మాశ్రయంగా మారింది. ఇందులో కవే సజీవ పాత్రలో జీవిస్తాడు. శతక కవులైన ధూర్జటి, రామదాసు, అన్నమయ్య వారి వారి కీర్తనల్లో ఆత్మాశ్రయాన్ని పాటించి ఆధునిక సాహిత్యానికి బాటలు వేశారు. అయితే ఈ యుగంలో తెలుగు సాహిత్య ప్రక్రియ వస్తువు, శైలి పరంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందనేది కాదనలేని నిజం. ఆంగ్ల భాష అధ్యయనం ఒకవైపు, పాశ్చాత్య భావాలను తెలుగు సాహిత్యంలో పరిశోధన చేయడం, రాజకీయ, సామాజిక ఉద్యమాలు తెలుగు సాహిత్యంలో మార్పులు తీసుకొచ్చాయి.

కథ, నవలలు రాయడం మొదలు పెట్టాక సాహిత్యంలో సామాజిక చైతన్యం మొదలైంది.. గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు, వీరేశలింగం పంతులు తదితరుల వ్యవహారిక భాషా ఉద్యమంతో సాహిత్యంలో కొత్త ఒరవడి మొదలైంది. ఆంగ్ల సాహిత్య అధ్యయనం వల్ల వస్తువు శైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆధునికయుగంలో కవిత్వమంటే పద్యం మాత్రమే కాదు, గద్యం, వచనం, సంభాషణ ఇంకా చాలా రకాలు. సంప్రదాయ, నవ్య సంప్రదాయ, కాల్పనిక , అభ్యుదయ,

విప్లవ ధోరణులతో నూతన ఆలోచనలు మేల్కొన్నాయి.

> తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాల నేపథ్యం ఎక్కువనే చెప్పాలి. సాహిత్య దృక్పథాన్ని సామాజిక విలువల్ని బట్టే నిర్ణయిస్తారు. ఛందోబద్ధమైన కవిత్వం రాసేప్పుడే వివిధ లఘు రూప కవిత్వాన్ని రాయడం చూశారు. అయితే వస్తువులో మార్పు తీసుకురావడం ఆధునిక సాహిత్య సామాజిక చైతన్యం.

తెలుగులో వచన కవిత్వం ద్వారా పద్య కవిత్వంలోని ఛందస్సు నుంచి దూరంగా వచ్చేశాము. దీంతో పాటు మినీ కవిత్వం కూడా మొదలయ్యింది. రూపపరమైన అంశాలు, ప్రయోగాలు చోటు చేసుకొని వచన కవిత్వం ఉధృతంగా వస్తున్నది. ఇందులో హైకూలు, నానీలు, నానోలు, టుమ్రీలు, రెక్కలు, రవ్వలు మణి పూసలు, మొగ్గలు, కైతికాలు అని రకరకాల కవితా ప్రక్రియలు ఆధునిక కవిత్వంలో చోటు చేసుకున్నాయి. అయితే వీటన్నిటి మీద సరైన దృష్టి లేకపోవడం విచారించతగ్గ విషయం...

తెలంగాణ ప్రాంతంలో సాహిత్యం విస్తృతంగా ఉన్నప్పటికీ ప్రపంచీకరణ ఫలితంగా గత కొన్నేండ్లుగా ఆదరణ తగ్గుతోంది. ఒకనాడు ఉద్యమంలో భాగమై పోరాటంతో మమేకమైన సాహిత్యం రానురాను ఎందుకో ఉద్యమభూమికకు కొంత ఎడమైంది. అస్తిత్వ ఉద్యమ సాహిత్యాన్ని ప్రోత్సహించే ,ఆదరించే వారు తగ్గారు.

> తెలుగునాట సాహిత్యానికి ప్రాణాధారమైన దిన, వార పత్రికలు సాహిత్యానికి ప్రత్యేక పేజీని కేటాయించటంలో వెనుకడుగేయటం కవులకు అశనిపాతమైంది. అయితే ఆ స్థానాన్ని సామాజిక మాధ్యమాలు భర్తీచేస్తున్నాయి. కథలు, కవిత్వం తదితర సాహిత్యం పత్రికల్లో కంటే సామాజిక మాధ్యమాల ద్వారానే విస్తృతంగా రావటం గమనార్హం.

వలసవాద సాహిత్యం.. దీన్నే డయాస్పోరా సాహిత్యం అంటారు. ప్రవాస సాహిత్యం అని కూడా అంటారు. ఇలాంటి సాహిత్యం కూడా ఆధునిక సాహిత్యంలో ఎక్కువగా వస్తున్నది. ఇప్పుడైతే తమకిష్టమైన పరిభాషలో ఉచితంగా రాసుకునే వీలు కలిగింది. సృజనాత్మకమైన సాహిత్యం వస్తున్నా, స్థిరమైన గొంతులు ఉన్నా నిక్కచ్చిగా ఉండాల్సినచోట నీరు గారిపోతున్నాయంటున్నారు నిపుణులు. సమాజంలో, సాహిత్యంలో ప్రజా సమూహాల భాగం చాలా అవసరం. ఏ సాహిత్య ధోరణిలోనైనా విమర్శ విరివిగా వచ్చినప్పుడే ఆ ప్రక్రియ బతుకుతుంది. ప్రజల పక్షాన ఉండాల్సిన గొంతులు పలుచబడటం వల్ల సాహిత్య కార్యాచరణ గొప్పగా జరగటం లేదనేది ఒప్పుకోవాల్సిన నిజం. సమాజంలో ప్రజల పక్షాన నిలబడ్డట్టే సాహిత్యంలో సమాజ పోకడలను రాస్తే ఆ సాహిత్యం ఎప్పటికీ తాజాగా ఉంటుంది.

వేగంగా మారుతున్న కాలాన్ని బట్టే సాహిత్యం రూపొందాలి. సృజనాత్మక శక్తులను స్త్రీలు పెంపొందించుకోవాలి. బహుజన సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉన్నది. కాల్పనికత ఉన్న వాస్తవిక ధోరణిలో నుండే కల్పనను రాస్తే ప్రతి రాత విశ్వసనీయంగా ఉంటుంది. మంచి సాహిత్యం కొరవడటానికి సాహిత్యకారుల్లోని ద్వంద్వవైఖరి కారణమవుతున్నది. ఎన్ని చెప్పినా, ఏది చెప్పినా చదువరే తీర్పు ఇచ్చేవాడు. పాఠకుడే దేవుడు ఏ సాహిత్య ప్రక్రియకు అయినా. మనిషి జీవించే హక్కుని సాహిత్యం ద్వారా కూడా పొందవచ్చు. అంత శక్తి సాహిత్యానికి ఉంది. ఎన్ని ఉద్యమాలు జరిగినా ఎన్ని పోకడలు అవలంబించినా ఇంకా కొన్ని చోట్ల సామాజికవృద్ధి జరగలేదనే చెప్పాలి.

సుభాషిణి తోట
95028 18774

సాహిత్యం ద్వారా పర్యావరణ చైతన్యం, పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి. అందుకే సాహిత్యం సమాజానికి చూపుడు వేలు. అటువంటి సాహిత్యాన్ని సుసంపన్నం చేసే అవకాశం సాహిత్యకారులు చేపట్టాలి. ఆధునిక సాహిత్యంలో ఇంకా ఇంకా మౌలిక మార్పులు రావాలి. టైంపాస్ సాహిత్యం కాకుండా ఎప్పటికీ నిలిచిపోయే అస్తిత్వ, సామాజికవృద్ధి, సమాజంలో చెడును నిర్మూలించి ప్రగతిశీలతను రక్షించుకోవడం ప్రస్తుతం ఆధునిక సాహిత్యంలో చేయవలసిన పనులు.

కలం పిలుపు

పురస్కారాల ఎంపిక

పాలకుర్తి సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక 2021-22 ద్వైవార్షిక పురస్కారాలను ప్రకటించింది. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్ (మహబూబ్ నగర్), సామాజిక శోధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్ (కరీంనగర్), రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్ (కరీంనగర్), పందిళ్ల శేఖర్ బాబు రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారానికి డాక్టర్ మైథిలి అబ్బరాజు (బెంగళూరు), వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారానికి ఎం ఎస్ ఆర్ వెంకటరమణ (సామర్లకోట), ముశం దామోదర్ రావు ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి సీఎస్సార్ ప్రభు (హైదరాబాద్), డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారానికి డాక్టర్ ఆరూరి మహేందర్ (విస్నూరు), దేవగిరి రాజయ్య స్మారక బిరుదుకు బూస రేణుకారాధ్య (విశాఖపట్నం) ఎంపికయ్యారు. ఈ నెల 31న పాలకుర్తిలో పురస్కారాలను ప్రదానం చేస్తారు.

- సోమనాథ కళాపీఠం

కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రముఖ కవి విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' ఆవిష్కరణ సభ ఈ నెల19న సాయంత్రం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరుగుతుంది. సభకు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. పుస్తకాన్ని ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరిస్తారు. కె. శివారెడ్డి అంకితం తీసుకుంటారు. సభలో కె. శ్రీనివాస్, కోయి కోటేశ్వర రావు, మామిడి హరికృష్ణ, కవి యాకూబ్, ఎం. నారా యణశర్మ, ఎం.వి.రామిరెడ్డి, జెల్లి విద్యాధర్ రావు ప్రసంగిస్తారు.

- పాలపిట్ట బుక్స్

ఆదర్శ కరదీపిక ఆదికావ్యం

రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పవిత్ర గ్రంథాలు. భారత సాహిత్యానికే అవి పట్టుగొమ్మలు. భారతీయ జీవన విధానానికి దర్పణాలు. మానవ జీవన విధాన రూపకల్పనకు చక్కగా ఉపకరించే సమున్నత సాధనాలు. ఆదర్శ మానవ జీవితానికి దారి చూపే కరదీపిక రామాయణం. మూడు కుటుంబ జీవితాలను మన ముందుంచి, ఏది ఉత్తమ జీవితమో చెప్పు, కుటుంబ బాంధవ్యాలను ఉదాహరణగా నిర్వచించి, ఎవరితో ఎలా మసలుకోవాలో సున్నితంగా సూచించే కావ్యమిది. అందుకే రామాయణానికి వైశిష్ట్యం కల్పించి, ఆరాధించారు.

వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకుని, ప్రాంతీయ భాషల్లో పలు రామాయణాలు వెలువడ్డాయి. తెలుగులో తొలి రామాయణం 'భాస్కర రామాయణం'. ద్విపదగా, చంపూ పద్ధతిలో రూపొందిన మొదటి రామాయణమిది. అది జానపద ప్రభావం లేకుండా ఇంచుమించు మూల రామాయణ కథ ఆధారంగానే సాగింది.

రామాయణం సాహిత్య చరిత్రలో కుటుంబ, సామాజిక ఆదర్శాలద్వారా జీవితంలో విస్తృతమైన దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొదటి రచనలలో ఒకటిగా చెప్పవచ్చు. స్త్రీ పాత్రల గురించిన నిర్దిష్టమైన అధ్యయనంతో గుర్తించిన విలువలు లేదా ఆదర్శాలు ఏవి చెప్పకుండా వదలలేదు. ఇది మానవ ఆలోచనల భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది. భారతదేశమే కాకుండా ప్రపంచంపై దాని ప్రభావాన్ని విస్తృతం చేస్తుంది.

> రామాయణమంతా సీత పాత్రే విస్తరించి ఉంటుంది. 'సీతాయః చరిత మహత్'దీనికి నిదర్శనం. కథాంశం మార్చడానికి (మంథర); కథాంశ మలుపు (కౌసల్య, సుమిత్ర, కైకేయి), అనుబంధించడం (శబరి, అహల్య), ఏకపక్ష పాత్ర(ఊర్మిళ), ఇలా మనకు ఎన్నో స్త్రీపాత్రలు నిజజీవితపు సారూప్యతను కనిపించేలా చేస్తాయి.

స్త్రీ పాత్రల ఔచిత్యం: భాస్కర రామాయణంలో మొదట అహల్య వృత్తాంతంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఇంద్రుడు అహల్యను మోసగించి గౌతముడు లేని సమయాన కోరి వస్తాడు. తన కూతతో పొద్దు పొడిచిన సంకేతం ఇచ్చాడు. గౌతముడు అనుష్ఠానాలు నిర్వర్తించుకోవడానికి వెళ్తాడు. ఆ సమయం చూసుకొని ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. దివ్యదృష్టి కలిగిన గౌతముడు అన్నీ తెలుసుకోవచ్చు. కానీ 'బుద్ధారెడ్డి' సామాన్య మానవుడి కల్పనలు కోడికూతతో తెల్లవారిందని భ్రమపడే విధంగా చిత్రించాడు. తిరిగి వచ్చిన గౌతముడు అహల్యను శపిస్తాడు. రంగనాథ రామాయణంలో 'పడతి పాషాణమై పడి యుండు నీవు' అని శపించినట్టు చెప్పారు.

మంథర: రాముడు చిన్నప్పుడు తన కాలువిరిచినందుకు ప్రతీకారం తీర్చుకునే స్వభావం కలదిగా ఈ పాత్రను బుద్ధారెడ్డి చిత్రిస్తాడు. యజ్ఞదత్తుడు మరణించినప్పుడు అతని తండ్రితో పాటు తల్లి కూడా ఎంతగానో విలపించిందని చెప్పడంలో ఆ పాత్రలో మాతృహృదయాన్ని వ్యక్తపరిచాడు.

ఊర్మిళ : రంగనాథ రామాయణంలో ఊర్మిళాదేవి నిద్ర ఘట్టాన్ని వివరిస్తాడు. అరణ్యవాసానికి వెళ్లిన తన భర్త (రాముని వెంట లక్ష్మణుడు) వెళ్ళినప్పుడు, లక్ష్మణ కర్తవ్య నిర్వహణకోసం నిద్రాదేవి తనను ఆవహించడం, లక్ష్మణుడు తిరిగి రాగానే, నిద్రాదేవి వెళ్ళిపోవడం ఇందులో చెప్పబడింది.

సీత: సీతాదేవిని హిందూమతంలోని విశ్వాసాల ప్రతీకగా చూపబడింది. విష్ణువు అవతారమైన శ్రీరాముడి ధర్మపత్ని హిందూసమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతాచరిత్ర మార్గదర్శకంగా నిలిచింది. సకల గుణాలు కలిగిన సాధ్విగా, భారతీయులకు నిత్యం ఆరాధించే సుగుణాల రాశిగా పేరొందింది. రామాయణ కథంతా సీతనే ప్రధాన పాత్ర వహించింది.

అంజన: కిష్కింధ నివాసి కుంజరుడి కూతురు, కేసరి భార్య అంజన.ఈమెకు వాయుదేవుడి అంశతో హనుమంతుడు జన్మించాడు. రామాయణంలో ఈమె ప్రధాన పాత్ర వహించింది.

అనసూయ: అంటే అసూయ లేనిది అని అర్థం. కర్దమ ప్రజాపతి దేవహూతుల పుత్రిక, అత్రి మహర్షి భార్య. వినయ వివేకాలు ఈమెకు సహజ భూషణాలు. పతిసేవలో లీనమైంది. ఆమె భక్తికి మెచ్చి అత్రి మహర్షి అష్టాక్షర మంత్రోపదేశం చేస్తాడు. మహర్షులకు కూడా పూజ్యనీయమైన మహోన్నత స్థానాన్ని పొందింది.

అరుంధతి: వశిష్ఠ మహర్షి ధర్మపత్ని. మహా పతివ్రత. బాలకాండలో ఈమె గురించి చెప్పబడింది.

కైకసి: సుమాలి, కేతుమతిల కుమార్తె. విశ్రవసుని భార్య. ఈమె రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణధిలకు తల్లి. గొప్ప శివభక్తురాలుగా ఈమెను చిత్రించారు.

కైకేయి: రామాయణంలో దశరథుని మూడవ భార్య. పుత్రకామేష్టి యాగం చేసిన తర్వాత యజ్ఞఫలం మూలంగా ఈమెకు భరతుడు జన్మిస్తాడు. తన దాసి అయిన మంథర మాటవిని, శ్రీరాముని 14 సంవత్సరాలు వనవాసానికి పంపమని, భరతునికి రాజ్యాభిషేకం జరిపించమని దశరథుని కోరుకుంటుంది. సీతారాముల వనవాసానికి ప్రధాన కారకురాలైంది.

కౌసల్య : అయోధ్యా రాజ్యానికి మహారాణి. కోసల రాకుమారి. ఈమె శ్రీరాముని తల్లి. మహావిష్ణువునే పుత్రునిగా పొందే అదృష్టం,'కౌసల్యా సుప్రజా రామా' అని కీర్తింపబడింది.

సుమిత్ర: కాశీరాజ్యపు రాకుమారి. యజ్ఞఫలం మూలంగా లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు, సౌమిత్రి అని లక్ష్మణునికి పేరు. రామాయణంలో సుమిత్ర పాత్ర చాలా కొంచెం కనిపిస్తుంది.

తాటకి: యక్షరాక్షసి. యక్షరాజైన సుకేతుడికి తపస్సు ఫలితంగా జన్మించిన పుత్రిక. విశ్వామిత్రుని యాగ రక్షణార్థం వచ్చిన రామలక్ష్మణులచే వధింపబడినది.

తార: కిష్కింధకాండలో వాలి భార్యగా చిత్రింపబడింది. అంగదుడు వీరి కుమారుడు. వాలి, సుగ్రీవుల వైరంలో తార హితోక్తులు ముఖ్యంగా చెప్పుకోదగినవి.

త్రిజట: ఇది ఒక కల్పిత పాత్ర. రావణుడు సీతను ఎత్తుకొని పోయి, లంకలో బంధించినప్పుడు, ఆమెకు రక్షణగా ఉంచిన రాక్షస స్త్రీలలో ఒకరు. ఈమె తన స్వప్న వృత్తాంతం సీతకు తెలుపడం ముఖ్యాంశంగా చెప్పవచ్చు.

మండోదరి: రామాయణంలో రావణుని భార్య. విశ్వకర్మ పుత్రుడైన మయబ్రహ్మ కుమార్తె. ఇంద్రజిత్తు ఈమె కుమారుడు. రావణుని పట్టమహిషి. బాహ్య సౌందర్యరాశి మాత్రమే కాదు, అంతర సౌందర్యం మిక్కిలి కొనియాడదగినది. నీతిని, ధర్మాన్ని, కర్తవ్యాన్ని ప్రబోధం చేయగల మనస్తత్వం కలది. అహల్య, తార, సీత, ద్రౌపదితో మండోదరి పంచకన్యగా ప్రసిద్ధి చెందింది.

శబరి: శ్రీరాముని భక్తురాలు. రాముని దర్శనానికై జీవితాంతం భక్తితో వేచి ఉండి, చివరికి రామదర్శనం పొందిన ధన్యజీవి. గిరిజన స్త్రీ అయిన శబరి వేదం తెలియనప్పటికీ యోగ సాధన, జ్ఞానం మోక్షం, పొందడానికి అందరూ అర్హులని నిరూపించిన కథ 'శబరి కథ'.

శూర్పణఖ: రావణబ్రహ్మ సోదరి. రాముని వనవాసకాలంలో రామునిపై మోజుపడి, లక్ష్మణునిచే ముక్కు చెవులు కోయించుకుంటుంది. రామ రావణ యుద్ధానికి ఈమె ఒక కారణమని చెప్తారు.

సులోచన: ఇది ఒక కల్పిత పాత్ర ఇంద్రజిత్తు భార్య.
శ్రుతకీర్తి: కుశ ధ్వజుని కుమార్తె. శత్రఘ్నుని భార్య.
సరమ: విభీషణుని భార్య.
శాంత : దశరథుని మిత్రుడైన రామపాదుని కుమార్తె.
లంకిని : లంకకు కాపలాగా ఉన్న ఒక రాక్షసి.
ధాన్యమాలిని: రావణుని రెండవ భార్య. అతికాయుని తల్లి.

ఇలా రామాయణంలో కొన్ని పాత్రలు మానవత్వాన్ని మరచిపోయి ప్రవర్తిస్తే, మరికొన్ని పాత్రలు మానవత్వానికి ప్రతీకలైనాయి. ఇది మానవ ఆలోచన, భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది. సమాజంలో లేదా ఒక వర్గం వ్యక్తుల స్థితి ఆధారంగా కానీ మానవ స్వభావం ఆధారంగా ఎటువంటి పక్షపాత భావాలతో చిత్రించబడలేదు.

> ఈ రామాయణ స్త్రీ పాత్రల ద్వారా మానవ స్వభావం పరిధిని ఒక సంగ్రహావలోకనం పొందడం జరుగుతుంది. ఏది తీసుకోవాలి లేదా తిరస్కరించాలనేది కథ ముందుకు సాగుతున్న కొద్దీ సంఘటనల ఫలితాన్ని బట్టి అవగతం అవుతుంది. రామాయణంలో చిత్రించిన పాత్రలు ప్రస్తుత సమాజంలో ఒక సాధారణ స్త్రీ జీవితానికి తన స్థానాన్ని తెలుసుకునే అంశంగా ఆలోచిస్తే ఈ పాత్రలు భారతీయ నేపథ్యానికి దూరంగా లేవు.

ఒకరి కుటుంబం, స్నేహితులతో పరస్పరం భాషించేటప్పుడు అది ప్రభావం చూపుతుంది. చుట్టూ ఉన్న సమాజంలో ఈ పాత్రలను ఒకదానితో ఒకటి పోల్చి అంచనా వేసినప్పుడు ఆధునిక మహిళ తప్పుల నుండి నేర్చుకోవడమే కాకుండా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోగలరు. సన్యాసులు, రాక్షసులు, దేవతలు పాత్రలు కేవలం ఆనందానికి మూలం మాత్రమే కాదు, మానవ స్వభావాలలోని లోపాలు లేదా బలాలు పెద్ద సంస్కరణల వర్ణనలుగా చూసినప్పుడు, కథ సందేశాత్మకంగా మారుతుంది. ఈ విధంగా ఒకే సమయంలో నేర్చుకోవడం, ఆనందించడం, సొంత జీవితంలో సాకారం చేసుకోవడం గమనిస్తాం.

డాక్టర్ శ్రీభాష్యం అనూరాధ
87903 25502

> మన సనాతన సంస్కృతిని నాడు నేడు రేపు ప్రతిబింబింప చేసి ప్రగతి బాటలు వేసేది రామాయణం .

నన్ను కోల్పోయిన నేను

అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడల్లా,
నీళ్లు చెమర్చిన కళ్లతోనే చిరునవ్వును చిందిస్తుంటా..
గతకాలపు స్మృతులన్నీ గాజు తెరపై ప్రత్యక్షమై,
ఒకప్పటి నన్ను గుర్తుచేసినప్పుడల్లా
కోల్పోయిన క్షణాలకై కుమిలిపోతుంటా..

యవ్వనపు ఛాయలు ఎగసెగసిపడుతున్నప్పుడు..
దారిలోని మృగాలు విసిరే కంటి శరాలకు ఎదురెళ్లి
ప్రతిఘటించిన తెగువ గుర్తొచ్చి అబ్బు రపడుతుంటా
అది మొండితనమో లేక చదువే ధ్యాసై,
నాలోని శ్వాసై నడిపించిన వైనమో..
నా ముందున్న పుస్తకంతో ప్రేమలో పడిపోయా!

స్వేచ్ఛా రెక్కలు కట్టుకొని విహరిస్తున్నంతలో
పరిణయ ఘడియలతో అడియాసలైన ఆశలు..
కలల సౌధం కుప్పకూలి శిథిలాలలో చిక్కుకొని
కోరికలన్నీ అంతమైన భావన....

అంతలోనే, తన రెక్కలపై కూర్చోబెట్టి
ప్రపంచాన్ని చూపుతూ, కంటికి రెప్పై కాపాడేవాడు
రాకుమారుడై వరించిన అదృష్టం
చుట్టూ బాధ్యతలతో బంధీ అయినా,
కను పాపల్లాంటి పిల్లల్ని పొంది,
ఆడతనంలో ఇమిడిపోయిన ఆనందం...

మరు క్షణం...
గతకాలపు అస్తిత్వాన్ని తలచుకుంటూ,
కోల్పోయిన పునర్వైభవానికై కళ్ళ
అద్దాన్ని దీనంగా ఆరా తీస్తున్నట్టు అనిపించి..
నేను కోల్పోయిన నన్ను తలచుకుంటూ
కనుమరుగైన ఉనికి కోసం తల్లడిల్లే
మరో రేపటికై నిరీక్షిస్తుంటా....

నాజ్రీన్ బేగం

దుమ్ము దేహకణాల సదృశ్యం

ఒకదానినొకటి చూస్తూ కూచున్న
కుర్చీ బల్లా ముందు
ఆలోచనలు నేలపైకి జారుతున్నాయి
ఒళ్లు తెలియక నృత్యంచేస్తున్న దుమ్ము కణాల ముందు
నలుదిక్కులూ తిరిగి ఎటూ పాలుపోక
సమయం ఆ కుర్చీలో కూలబడింది

కుర్చీ జ్ఞానపీఠమై దేహాన్ని మోస్తుంది
ఆలోచనలక్కడ స్థిర స్థావరం ఏర్పరచుకుంటుంటే
జ్ఞానం మెల్లిగా శ్వాస తీసుకుంటుంది
కుర్చీ చెక్కచేతులు ఆత్మను ఆత్మీయంగా
ఆలింగనం చేసుకుంటుంటే
అన్ని బంధనాల నుంచి విముక్తి పొందిన దానిలా
ఆత్మ సేద తీరుతుంది

బల్ల మీద ఎన్ని కథలు పురుడు పోసుకున్నాయో
అనుబంధాల ఎన్ని బంధనాలో
ఎన్ని ప్రేమలు ఆ గాలిలో బందీ అయ్యాయో
ఎన్ని విడుదల పొంది ఎగిరిపోయాయో
చూసే ధూళికే తెలుసు

తీక్షణంగా చూస్తున్న బల్ల కథల వేదిక,
అక్కడ కలలు స్వేచ్ఛగా విచ్చుకుంటాయి
దాని ఉపరితలం కలలదేహాన్ని మోస్తుంటే
జీవితపు క్లిష్టమైన సందర్భాలు
అతుకులు అతుకులుగా బల్లమీద పోగుబడి
చిత్రమైన కాన్వాస్‌గా మారిపోతుంది

అడుగుజాడలను భద్రపరుచుకుంటూ
నేల దారులు ఆగిపోయిన చోట,
జ్ఞాపకాలు మరుగున పడకుండా
పాదాలను వెతుకుతూ కాన్వాస్ నిండా
కాలం పాద ముద్రలు
అందుకే ప్రయాణాలకు మద్దతు నిస్తూ
గమ్యం విశ్రాంతి తీసుకుంటుంది

నిశ్శబ్దంగా ఊగుతున్న అదృశ్య శకలాలు ఊహలు,
కుర్చీ నుండి టేబుల్ వరకు,
అక్కడ నుంచి నేలపైకి
తాత్కాలిక గృహాల నుంచి
స్వంత ఇంటికోసం కథ అన్వేషణ

ఈ జీవన గదిలో
ఆలోచనలు చివరి మజిలీ చేరేవరకు
దుర్బలమైన మృత్యునీడ సారాంశం వెతికేందుకు
కుర్చీ బల్లా నేలా దుమ్ము చెప్పే కథలు
నిర్విరామంగా వింటూనే ఉన్నాయి
ఇలా.. దుమ్ము దేహకణాల సదృశ్యం.

మెర్సీ మార్గరేట్
90528 09952

భూమి రాణి

భూమి చలాకి పిల్లలా గుండ్రంగా తిరుగుతూ
రాత్రి పగలు ఆడుకుంటోంది !
నిద్ర మాట ఎరుగదు !!
వర్షంలో నానుతూ నానుతూ
పచ్చపచ్చగా సింగారించుకొని
భూమి పూలు పూలుగా భ్రమణం !

ఏ దేవుణ్ణి కొలుస్తుందో ఏ వ్రతమో
ఎప్పుడూ ఆత్మ ప్రదక్షిణే! ఆగేదే లేదు

ఆకాశం ఇచ్చిన ఇంద్రధనుస్సు పృథ్వికి కానుకగా
ఏడు వర్ణ వర్ణాల నగ !
మంచు తెరవేసుకుని సుస్పష్టంగా
ఎంత అందమో భూమి రాణిది !
అన్ని ఋతువులతో మమేకమై భూమి ఫలాలతో
ద్విగుణీకృత సౌందర్య ధామం !
ఇవన్నీ భూమి రాణి ఏం చేసుకుంటుంది
అందరికీ పంచేస్తుంది

ఏ దేశంలోని వారైనా భూమి తల్లికి
అందరూ బిడ్డలే !
భూమి తల్లిది ఏ మతమూ కాదు !
అసలు అందరికి ఇలవేలుపు భూమే కదా !
గాలి అగ్ని నీరుతో భూమి గనులు గనులుగా
కల్పతరువు అక్షయ పాత్ర !
ఎంత బరువైనా భూమాతకు మోయడమే ఆనందం !
తల్లి కదా ! ఎప్పుడూ తల్లడిల్లదు !!

కందాళై రాఘవాచార్య
87905 93638

నీవు మొలవడం ఓ తమాషా..

నచ్చవు గాని
మెత్తగా గుచ్చినా
భలే ఇష్టం నీవంటే....

అమాంతం నిజంలోకి దూకి
ఆ ధూళిలోనే ఒడిసిన కలను
ఓర్పునల్లి , నీడను చల్లి

విస్తృతంగా వీచే ఎండను తాగి
ఎర్రని కిరణాలను కౌగిట్లో ఆర్పి
మేఘమై కరగడంలో

తడవడం సరదా
తేమవడం సందడి
అందులో నేను మొలవడం
ఓ తమాషా..

...శ్రీ సాహితి
9704437247